రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపిక

విశాలాంధ్ర-సబ్బవరం: రాష్ట్రస్థాయి జూడో పోటీలకు సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి శీరంశెట్టి మధుబాబు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి. శంకర్ తెలిపారు. ఆంధ్ర యూనివర్సిటీ అంతర్ కళాశాలల జూడో క్రీడా విభాగం లో ఆంధ్ర విశ్వవిద్యాలయం టీం కీ సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండవ సంవత్సరం కెమిస్ట్రీ మేజర్ విభాగాన్ని చెందినటువంటి విద్యార్థి శీరంశెట్టి మధు బాబు ఎంపిక కాబడ్డారు... తదుపరి ఆంధ్ర విశ్వవిద్యాలయం తరపున అంతర్ విశ్వవిద్యాలయాలు పోటీల్లో పాల్గొంటారు. కళాశాల విద్యార్థి ఎంపిక కావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి శంకర్, ఇతర అధ్యాపకులు హర్షాన్ని వ్యక్తం చేశారు.

భయాందోళన కలిగించే బ్లాస్టింగ్ లు నిలిపివేయాలి

సిపిఐ నాయకులకు వినతిపత్రం అందజేసిన దుర్గానగర్ వాసులు

విశాలాంధ్ర-పాయకరావుపేట: పోలవరం కాలువ తవ్వకాలలో భాగంగా చేస్తున్న భయాందోళనలను కలిగించే బ్లాస్టింగ్ లను నిలిపివేయాలని పట్టణంలోని దుర్గానగర్ వాసులు సిపిఐ మండల కార్యదర్శి వెలుగుల అర్జున్ రావును కోరారు. ఈ మేరకు కాలనీవాసులంతా అర్జునరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి వెలుగుల అర్జునరావు మాట్లాడుతూ పోలవరం కాలువ తవ్వకాల్లో భాగంగా చేస్తున్న బ్లాస్టింగ్ ల వల్ల సమీప ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బ్లాస్టింగ్ లతో ఇళ్లకు నష్టం కలుగుతుందని, ఆ ప్రాంత ప్రజలు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని జీవిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత చర్యలు తీసుకుని బ్లాస్టింగ్ లను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పోలవరం కాలువ తవ్వకాలకు తమ పార్టీకి అభ్యంతరం లేదని, అయితే ఆ ప్రాంత ప్రజల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని బ్లాస్టింగ్ లను జరపాలని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న బ్లాస్టింగ్ లు పాయకరావుపేట గ్రామం మొత్తం వినిపిస్తున్నాయని, తవ్వకాల సమీపంలోని ప్రజలు తవ్వకాల్లో ఎగసిపడుతున్న రాళ్లతో, బ్లాస్టింగ్ లతో తమ ఇళ్లు మరమ్మతులకు చేరుకుంటున్నాయని వాపోతున్నారని తెలిపారు. తవ్వకాలు జరిపే ప్రాంత ప్రజలకు, వారి ఇళ్లకు ఎటువంటి నష్టం లేకుండా సామర్థ్యం తగ్గించి బ్లాస్టింగ్ లు జరపాలని అర్జునరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.దుర్గ, యం. మంగ, పి. అమ్మాజీ, ఏ.లోవ రత్నం, వి. దేవి, వి. రమణమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న కూటమి సర్కార్

సీపీఐ ఆరోపణ

విశాలాంధ్ర-అనకాపల్లి: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జగన్మోహన్ రెడ్డి జిల్లాకు వస్తున్న సందర్భంగా సాధారణ ప్రయాణికులను కూడా ఇబ్బందులకు గురిచేసి నియంత్రణ చేయడం దుర్మార్గమని సిపిఐ జిల్లా సమితి సభ్యులు వియ్యపు రాజు అన్నారు. కూలి నాలి ముసలి ముతక గర్భిణీ స్త్రీలు ఆరోగ్యం బాగోలేక ఆసుపత్రికి వెళ్లి ప్రయాణికులను కూటమి ప్రభుత్వం ఎక్కడకక్కడ పోలీసుల ద్వారా ట్రాఫిక్ కి అంతరాయం కలిగించి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం తీరు పులిని చూసి పొట్టి నక్క వాతలు పెట్టుకున్న సామెత గుర్తొస్తుందని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాకను చూసి నరేంద్ర మోదీ, నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, భయపడుతున్నారని హేళన చేశారు. ప్రజలను ఇబ్బంది పెట్టే చర్యలు మానుకోవాలని పోలీసుల ద్వారా ప్రజలను నియంత్రణ చేయడం సరికాదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మన ప్రభుత్వం మంచి ప్రభుత్వం అని ప్రచారాల ఆర్భాటాలు చేసి గొప్పలు చెప్పుకునే మీరు ప్రతిపక్ష నాయకుడిని చూసి భయపడటం సిగ్గుచేటని అన్నారు. ఇలాంటి సిగ్గుమాలిన పనులు మానుకుని సూపర్ సిక్స్ హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం కోసం ఆలోచన చేయాలని హితవు పలికారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి 3000 రూపాయలు,మహిళలకు నెలకు 1500 రూపాయలు తదితర హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

జీఎస్టీ పై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-కేకోటపాడు: సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమం పై స్థానిక సిహెచ్సి వైద్య సిబ్బంది గురువారం ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కలిగించారు. ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం లో స్థానిక ఎంపీడీవో సాంబశివరావు పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరికి ఎంతో ముఖ్యమైన హెల్త్ ఇన్సూరెన్స్ , ఇతర వైద్య పరికరాలపై జిఎస్టి తగ్గిందని అలాగే నిత్యం వాడే నిత్యవసర సరుకులు గృహోప కరణాలు రేట్లు భారీగా తగ్గుతాయి అన్నారు . దీంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడి వారి ఆదాయం రెట్టింపు అవుతుందన్నారు . అంతకుముందు జిఎస్టి తగ్గింపునకు చెందిన కరపత్రాలు బ్యానర్ల ద్వారా అవగాహన ర్యాలీని ప్రదర్శించారు .ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎర్రంశెట్టి భవాని వైద్యులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చేగువేరాకు ఘన నివాళి



విశాలాంధ్ర-పరవాడ: చేగువేరా ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. చేగువేరా వర్ధంతి సందర్భంగా గురువారం పరవాడ సంతబయలు వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ చేగువేరా ఒక దేశానికో, ఒక ప్రాంతానికో పరిమితమైన వ్యక్తి కాదని యావత్ ప్రపంచానికి శక్తినిచ్చిన నేత అని కొనియాడారు. ప్రపంచంలో ఎవరికి ఏ అన్యాయం జరిగినా చేగువేరా స్పందించినట్లు తెలిపారు. యువతకు దిశా నిర్దేశం చేసి ఆచరించి చూపించిన మార్గదర్శి అని గుర్తు చేశారు. తుది శ్వాస విడిచే వరకూ ప్రజల కోసం పోరాడిన అసలైన కమ్యూనిస్టు యోధుడు చేగువేరా నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకం అన్నారు. చేగువేరా సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్తామని ఈ సందర్భంగా గనిశెట్టి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్. బాబురావు, అప్పలరాజు, పద్మ, మంగ తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంటలో ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం

విశాలాంధ్ర-రోలుగుంట: రోలుగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో గురువారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ హేమలత, అంగన్వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయుడు టీవీ శేషగిరిరావు బాల్యవివాహాలు, లింగ వివక్షతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 8, 9, 10వ తరగతి విద్యార్థినిల కోసం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రధానోపాధ్యాయుడు టీవీ శేషగిరిరావు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థినులు సమాజంలో తమ పాత్రను గుర్తించి ధైర్యంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

అన్న క్యాంటీన్ నిర్మాణ పనుల పరిశీలన

విశాలాంధ్ర-పాయకరావుపేట: పట్టణంలోని అరటికాయల మార్కెట్లో నిర్మిస్తున్న అన్న క్యాంటీన్ నిర్మాణ పనులను తెలుగుదేశం పార్టీ నాయకులు పరిశీలించారు. నిర్మాణ పనులు పూర్తిచేసుకుని త్వరలోనే పేదలకు అందుబాటులో ఉంటుందని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చించలపు ప్రదీప్, పట్టణ అధ్యక్షులు యాళ్ల వరహాల బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట పిఎసిఎస్ అధ్యక్షులు దేవవరపు రాజుబాబు, పెదిరెడ్డి శ్రీను, మలిపెద్ది వెంకటరమణ, జూరెడ్డి ప్రసాద్, గొల్లపల్లి నాగు, చిరుకూరి పేర్రాజు, రాజన ఆది, వేములపూడి అప్పారావు, ముంజులూరి దుర్గాప్రసాద్, బంగారి లక్ష్మణ్ పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి కూటమి నాయకుల భూమిపూజ

విశాలాంధ్ర-కశింకోట: స్థానిక పెద్ద గుమ్మం నుంచి అట్ట వీధి వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం కూటమి నాయకులు భూమిపూజ చేశారు. మాజీ మంత్రి స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, కశింకోట జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ భీమరశెట్టి చిన్నికృష్ణ ఆదేశాలమేరకు దశాబ్దాలుగా అధ్వానంగా ఉన్న ఈ రోడ్డును బాగుచేయాలని గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజలు, స్థానికులు పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సీసీరోడ్డుకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించడంతో ప్రజలు, హర్షం వ్యక్తం చేస్తున్నారని కూటమి తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వేగి గోపికృష్ణ, సిదిరెడ్డి శ్రీనివాసరావు, దాడి నాగరాజు,వేగి దొరబాబు, కాండ్రేగుల సతీష్, వేగి వెంకట్రావు, తకాసి కృష్ణ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట మండలంలో నిరుపయోగంగా హెల్త్ క్లినిక్

విశాలాంధ్ర-రోలుగుంట: రోలు గుంట మండలంలోని రోలు గుంట, బుచ్చెంపేట పీహెచ్‌సీ పరిధిలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ప్రజలకు ఉపయోగం లేకుండా మారాయి. ముఖ్యంగా వడ్డిప సరభవరం విహెచ్‌సీ ఎప్పుడూ మూసే ఉంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్లినిక్ సిబ్బంది తరచూ గిరిజన గ్రామాలైన లోసింగి, పిత్రుగెడ్డ, కోరుప్రోలు ప్రాంతాలకు వెళ్తున్నట్లు చెప్పుకుంటూ విధులు నిర్వర్తించకపోవడం విమర్శలకు దారితీసింది. అధికారులు ఈ నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జమాదులపాలెం గ్రామ వైసిపి అధ్యక్షులుగా ఆకాష్

యూత్ అధ్యక్షులుగా నాగ అప్పారావు

విశాలాంధ్ర-కశింకోట: మండలంలోని జమాదులపాలెం గ్రామ వైఎస్ఆర్ సి పి అధ్యక్షులుగా కరక ఆకాష్, యూత్ అధ్యక్షులుగా బొట్టా నాగ అప్పారావు ను, నియమించినట్లు బుధవారం అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ ఉత్తర్వులు వారికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మాపై ఎంతో నమ్మకంతో ఈ పదవిని అప్పగించినందుకు నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే గ్రామంలో వైఎస్ఆర్ సిపి బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. వైయస్ఆర్ సిపీ కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. వైఎస్ఆర్ సిపి కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా ఆ సమస్యను పరిష్కరించే విధంగా తమ వంతు కృషి చేస్తామని అన్నారు. వీరికి పదవి రావడం పట్ల, పలువురు హర్ష వ్యక్తం చేశారు.

డీఎస్సీ-2025 లో సెలెక్ట్ అయిన అభ్యర్థులకై ప్రచురించిన పుస్తకాలు ఆవిష్కరణ

విశాలాంధ్ర-సబ్బవరం : మండల కేంద్రంలోని ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ వారు, నూతనంగా డీఎస్సీ-2025 లో సెలెక్ట్ అయ్యిన అభ్యర్థులు కొరకు ప్రచురించిన పుస్తకాలను అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు గురువారం ఆవిష్కరించారు. ఏపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.వేంకటపతిరాజు మాట్లాడుతూ ఈ పుస్తకాల్లో నూతనంగా ఉపాధ్యాయ వృత్తిలో చేరబోతున్నవారికి సర్వీస్ ఓరియెంటెడ్ మేటర్స్ తో కూడిన సమాచారమును అందజేయడం జరిగిందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ధర్మారావు,దుర్గాప్రసాద్, సబ్బవరం మండలశాఖ అధ్యక్ష ప్రధానకార్యదర్శులు రెడ్డి ప్రసాదరావు, హేమంత్ సుదేవ్,కార్యకర్తలు మహాలక్ష్మి నాయుడు,బండారు ముత్యాలు నాయుడు,తారక్ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏషియన్ పెయింట్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

విశాలాంధ్ర-మునగపాక: గ్రామస్తులు ఉచిత వైద్య శిబిరాల ను సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. మునగపాక పంచాయతీ కార్యాలయం వద్ద ఏషియన్ పెయింట్స్ ఉచిత సంచార వైద్య సేవల్లో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.వైద్యులు విజయకుమార్, పద్మావతి,సుధీర్ పాల్గొని బీపీ,షుగర్,ఇతర వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏషియన్ పెయింట్స్ సంచార వైద్యశాల ఆర్గనైజర్ అచ్చియ్యనాయుడు, వైద్య సిబ్బంది,గ్రామస్తులు పాల్గొన్నారు.

మోదమ్మను దర్శించిన జిల్లా ఖజానా అధికారి

విశాలాంధ్ర-వి.మాడుగుల: మాడుగుల శ్రీమోదకొండమ్మ అమ్మవారిని గురువారం అనకాపల్లి జిల్లా ఖజానా అధికారి వియల్ సుభాషిని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ఆమెకు ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు కమిటీ సభ్యులు అమ్మవారి మెమెంటో అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చోడవరం సబ్ ట్రెజరీ ఆఫీసర్ ఎల్.మీనా పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ : ఎమ్మెల్యే సుందరపు

విశాలాంధ్ర-యలమంచిలి: అనకాపల్లి జిల్లా యలమంచిలి నియోజ కవర్గం యలమంచిలి పట్టణంలో గల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై సమావేశం నిర్వహించిన నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఉన్నతమైన ఆలోచనతో జీఎస్టీ లో సూపర్ సేవింగ్స్ లా కొన్ని వస్తువులపై పన్నులను తగ్గించి, పేదవారికి చేరువయ్యేలా చేసినందుకు ప్రధాని నరేంద్రమోదీ కి, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా 2019-24 వరకూ అనాలోచిత, అవగాహన రాహిత్యంతో నిర్మించిన మెడికల్ కళాశాలలు, ప్రభుత్వ ఆసుపత్రిలు ఉన్నాయన్నారు. సమావేశంలో ఆసుపత్రి వైద్య సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన గుడబండ, గొలుసు కుటుంబాలు

జగన్ పర్యటన నేపథ్యంలో వీరి చేరికపై సర్వత్ర చర్చనీయాంశం

కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్

విశాలాంధ్ర-నర్సీపట్నం: నర్సీపట్నం మున్సిపాలిటీ మాజీ చైర్పర్సన్ మాజీ వైస్‌చైర్మన్ గుడబండ ఆదిలక్ష్మి, గొలుసు నరసింహమూర్తి 17వ వార్డు గెలుపులో వైసీపీ తరపున గత మున్సిపల్ ఎన్నికలలో కీలక పాత్ర పోషించిన గుడబండ నాగేశ్వరరావు(జి ఎన్ఆర్) తమ అనుచరగణంతో గురువారం టిడిపి తీర్థం పుచ్చుకున్నారు . టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయలు విజయ్, చోడవరం శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్ రాజు, స్పీకర్ సతీమణి చింతకాయల పద్మావతి, వీరికి కండువాలు కప్పి సాధరంగ పార్టీలోకి ఆహ్వానించారు. గురువారం మాకవరపాలెం మండలం భీమాబోయినపాలెం సమీపంలోని మెడికల్ కాలేజ్ ను జగన్ పర్యటించే సమయంలో వీరంతా టిడిపిలో చేరడం నర్సీపట్నంలో చర్చనీయాంశంగా మారింది. వైఎస్ఆర్సిపి నుంచి కౌన్సిలర్ గా గెలిచి కొన్ని రోజుల నుంచి మాజీ ఎమ్మెల్యే గణేష్ కు, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న వీరు టిడిపిలో చేరడంతో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం మొదలైంది. ముఖ్యంగా బలిఘట్టంలో వైసిపి క్లీన్ స్వీప్ అవడంతో వైసీపీ శ్రేణుల్లో అలజడి మొదలైంది. మున్సిపల్ ఎన్నికలు పూర్తయిన తర్వాత చైర్ పర్సన్ గా రెండు సంవత్సరాలు పదవి పొంది పార్టీ అధిష్టానం మేరకు రెండు సంవత్సరాలు పదవి కాలం పూర్తయ్యాక రాజీనామా చేసిన ఆదిలక్ష్మి తర్వాత క్రమంలో జరిగిన పరిణామాల నేపథ్యంలో పార్టీ నుంచి సస్పెండ్ అయ్యారు. వీరితోపాటు వైసీపీలో కీలక పాత్ర పోషించిన జి ఎన్ ఆర్ కూడా టిడిపి కండువా కప్పుకున్నారు. వీరిద్దరితోపాటు మున్సిపాలిటీలో వైస్ చైర్మన్ గా పనిచేసి గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ వైఎస్ఆర్సిపి ప్రభుత్వం లోను నాలుగో వార్డ్ కాపు వీధిలో క్రియాశీలకంగా వ్యవహరించిన గొలుసు నరసింహమూర్తి కూడా టిడిపి కండువా కప్పుకున్నారు. అయితే ఇదిలా ఉండగా త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మరల మున్సిపాలిటీ పీఠం కైవసం చేసుకునేందుకు వీరు టిడిపిలో చేరినట్టుగా పట్టణంలో పలువురు గుసగుసలాడుకుంటున్నారు. ఏది ఏమైనాప్పటికీ నర్సీపట్నం టిడిపిలో వీరి చేరికలతో నూతన ఉత్సాహ సందడి మొదలైంది.

సుప్రీంకోర్టు న్యాయమూర్తి గవాయిపై దాడికి నిరసన

విశాలాంధ్ర-అనకాపల్లి: భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు న్యాయమూర్తి గవాయిపై మతోన్మాద లాయర్ రాజేష్ కిషోర్ కాలు బూటు విసిరి దాడి చేయడానికి నిరసిస్తూ నెహ్రూ చౌక్ లో అంబేద్కర్ విగ్రహం దగ్గర సిపిఐ, సిపిఎం బీఎస్పీ దళిత సంఘాల నాయకులు తీవ్ర నిరసన తెలియజేశారు.అంబేద్కర్ సేవా సంఘం నాయకులు బుసిరాజు అధ్యక్షతన జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి. కోటేశ్వరరావు, సిపిఐ జిల్లా నాయకులు వై ఎన్ భద్రం, బి ఎస్ బి నాయకులు సూది కొండ మాణిక్యాలరావు, జై భీమ్ సేవా సంఘ నాయకులు రేబాక మధు తదితరులు మాట్లాడుతూ.సుప్రీమ్ న్యాయమూర్తి గవాయిపై జరిగిన దాడి రాజ్యాంగం పైన, యావత్ భారత దేశ ప్రజల పైన జరిగిన దాడిగా పరిగణించాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత న్యాయమూర్తి పైన సనాతన వాద మతోన్మాది దాడి చేయడం సిగ్గుచేటని దోషిని వెంటనే అరెస్టు చేసి రాజ్య ద్రోహం నేరం కింద కేసు పెట్టి కఠినంగా శిక్షించాలని వారు కోరారు. సనాతన ధర్మం పేరుతో దళితులపైన, మైనార్టీలు పైన దాడి జరగడం సిగ్గుచేటు అన్నారు. స్వాతంత్రం వచ్చి 80 ఏళ్ళు అవుతున్న బడుగు బలహీన వర్గాలకు మహిళలకు ఈ దేశంలో రక్షణ కరువైందని, రక్షణ కల్పించవలసిన ప్రభుత్వాలే మతోన్మాద ముసుగులో దాడులు కు ఉసుగోలపడం సిగ్గుచేటు అన్నారు. గవాయిపై దాడి చర్యను యావత్ ప్రపంచం చూస్తుందని, ఇలాంటివి పునరావతం అయితే ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజు వస్తుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రుతుల శంకర్రావు, గంటా శ్రీరామ్ సిపిఐ నాయకులు కోరుబిల్లి శంకర్రావు మత్తూర్తి సూరిబాబు, ఆర్ శ్రీనివాసరావు, బోని గణేష్, తేలయ్య బాబు దళిత సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎం.డి.ఎం. మహిళా కార్మికులకు బకాయి బిల్లులు, వేతనాలు చెల్లించాలి

ఎం.డి.ఎం. మహిళా కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి

విశాలాంధ్ర-చోడవరం: ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు గత జూలై నెల నుండి నేటి వరకు గల బకాయి బిల్లులు, వేతనాలు తక్షణమే చెల్లించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గునూరు వరలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎండిఎం మహిళా కార్మికులు గురువారం చోడవరంలో ఆందోళన చేపట్టారు ఈ కార్యక్రమంలో ఎం డి ఎం నాయకురాలు వరలక్ష్మీ మాట్లాడుతూ ప్రభుత్వం బిల్లులు వేతనాలు సకాలంలో చెల్లించకపోవడంతో మహిళ కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అప్పులు తెచ్చి మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనివల్ల మహిళ కార్మికులు, వారి కుటుంబాలు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, ప్రభుత్వం స్పందించి వెంటనే బిల్లులు, వేతనాలు ఇవ్వాలని, ప్రభుత్వ అధికారుల దృష్టికి కార్మికులు సమస్యలు తీసుకువెళ్లినప్పటికీ పరిష్కారం కావడం లేదని, ఇలా అయితే ఈ పథకాన్ని ఎలా కొనసాగించగలమని, పిల్లలకు సరైన భోజనం ఎలా అందించాలని ప్రశ్నించారు. అర కొర వేతనాలు కూడా సకాలంలో ఇవ్వకపోతే ఎలా బ్రతకాలని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగు తున్న ధరలకు అనుగుణంగా బడ్జెట్ ని పెంచాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలని, పాఠశాలలకు ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని, ప్రమాదాలు జరుగుతున్నప్పుడు కార్మికులు చాలాచోట్ల కాలిపోయి ఇబ్బందులు, ప్రమాదాలు ఎదుర్కొంటు న్నారన్నారు. ఎండిఎం మహిళా కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎండిఎం బకాయి బిల్లులు, వేతనాలు వెంటనే చెల్లించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ నెల 13న జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో మధ్యాహ్న భోజన కార్మికులు, సానిటేషన్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు కాంతారావు ఆకస్మిక తనిఖీలు

విశాలాంధ్ర-యలమంచిలి : జాతీయ ఆహార భద్రత చట్టం 2013 అమలులో భాగంగా రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి కాంతారావు అనకాపల్లి జిల్లాలో ఎలమంచిలి ప్రాంతంలో పలు రేషన్ డిపోలను మరియు అంగన్వాడీ కేంద్రాలను సందర్శించడం జరిగింది. ముందుగా ఎలమంచిలి యాతపేట లో డిపో నెంబర్ 0341003 సందర్శించి డిపోలోని స్టాక్ వివరాలు పరిశీలించి రైస్ మొత్తంగా కింద వేసి సప్లై చేస్తున్న కారణంగా ప్లాస్టిక్ కవర్లు ఉన్నందున కారణంగా డిపో కి మేము ఇవ్వాల్సిందిగా అధికారులు ఆదేశించారు. డిపో నెంబర్ 0341007 లబ్ధిదారులకి సరైన సమయంలో సప్లై అందాలే చూడాలని చెప్పారు. డిపో నెంబర్ 0341005 ను సందర్శించి లబ్ధిదారులకు రైస్ ఇచ్చే సమయంలో రైస్ మొత్తం కింద వేసి ఇవ్వడం మూలాన బియ్యం కలుషితం అవుతుందని హెచ్చరించారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అంగన్వాడీ కేం ద్రం సందర్శించి ఫుడ్ సేఫ్టీ అధికారులు సమక్షంలో ఆహార నాణ్యతను పరీక్షించి పిల్లలకు అందించే పోష కాహార విషయంలో పూర్తిస్థాయి నిబద్ధత చూపించాలని అంగన్వాడి వర్కర్స్ కి ఆదేశించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికల) సందర్శించి స్కూల్లో ఉన్నటువంటి మధ్యన భోజన పథకం అమలు తీరుతెన్నులు పరిశీలించి పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. జడ్పీ హైస్కూల్ కొత్తపేట స్కూల్ ని కూడా సందర్శించి విద్యార్థులతో ముచ్చటించి వారు ఉన్నత ప్రగతికి పలు సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారులు ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్మెంట్ అధికారులు డిస్ట్రిక్ట్ ఎడ్యుకేషన్ అధికారులు ఫుడ్ సేఫ్టీ అధికారులు లీగల్ మెట్రాలజీ అధికారులు వెల్ఫేర్ హాస్టల్ అధికారులు మొదలగు వారు పాల్గొనడం జరిగింది.

లబ్ధిదారులకు పట్టాలు అందజేసే బాధ్యత కూటమి ప్రభుత్వానిదే

విశాలాంధ్ర-మాడుగుల: ఐదవ విడత భూపంపిణీలో రావికమతం, మాడుగుల మండలాలలో అందజేసిన భూములకు వెబ్ ల్యాండ్ లో నమోదు చేసి లబ్ధిదారులకు పట్టాలు అందజేసే పూర్తి బాధ్యత కూటమి ప్రభుత్వానిదని మాడుగుల మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు అన్నారు. గురువారం మాడుగుల పంచాయతీ రాజ్ అతిథిగృహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2010, 11,12, సంవత్సరాలలో అప్పటి శాసనసభ్యులు గవిరెడ్డి రామానాయుడు అసైన్‌మెంటు. కమిటీ చైర్మన్ హోదాలో మాడుగుల మండలంలో గల కింతలి వల్లపురం సమీపంలో గల కొప్పు కొండమ్మ కొండ పరిధిలో 56 మంది లబ్ధిదారులకు 84.6.9 ఎకరాలు, వమ్మలి పరిధిలో గల ఊర్లోవకొండ పరిధిలో 51 మంది లబ్ధిదారులకు 31.30 ఎకరాలు, వమ్మలి జగన్నాధపురం గ్రామంలో 14 మంది లబ్ధిదారులకు 16.8.2 ఎకరాలు, ఎం.కృష్ణాపురం గ్రామంలో 27 మంది లబ్ధిదారులకు 29.64 ఎకరాలు, మొత్తం ఉర్లోవకొండపై 222 మంది లబ్ధిదారులకు 366.50ఎకరాలు, అలాగే నాగుళ్ళ కొండపై పొంగలిపాక గ్రామానికి చెందిన 50 మంది లబ్ధిదారులకు 10.6.1 ఎకరాలు, ఆవురువాడ గ్రామంలో 41 మందికి 59.6 ఎకరాలు పంపిణీ చేశారని విపులంగా తెలియజేశారు. వీరందరికీ ఇచ్చిన డీ ఫారం భూములపై అందజేసిన పట్టాలను, త్వరలో వెబ్.ల్యాండ్ చేసి వారికి సదరు భూములపై అన్ని రాయితీలు, పూర్తి హక్కులు పొందేలా కల్పించి పట్టాలను త్వరలో అందజేస్తామన్నారు. సదరు భూములను అనుభవిస్తున్న లబ్ధిదారులు అందరూ ఎటు వంటి ఆందోళన చెందనవసరం లేదని వారికి పట్టాలు అందజేసే పూర్తి బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష కార్యదర్శులు నందారపు సన్యాసిరావు, పుప్పాల రమేష్, పెద్దేరు జలాశయం చైర్మన్ అద్దేపల్లి జగ్గారావు, కింతలి పిఎసిఎస్ అధ్యక్షులు ఉండూరు దేవుడు, ఎం.కృష్ణాపురం సర్పంచ్ వద్దాది చారుమతి, పొంగలిపాక సర్పంచ్ నాయని సత్యనారాయణ, వమ్మలి సర్పంచ్ సింహాచలం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.